తూతూ మంత్రంగా జాబ్‌మేళాలు

- జిల్లా ఉపాధి కార్యాలయం వెలవెల
- ఎంప్లాయ్‌మెంట్ కార్డు ప్రామాణికంగా లేకపోవడం మరో కారణం
- వేతనాలు తక్కువగా ఉండడంతో ఆసక్తి చూపని నిరుద్యోగులు
- అవగాహన సదస్సులు కరువు



జిల్లా ఉపాధి కార్యాలయం

మహబూబాబాద్: తూతూ మంత్రంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారు. దాంతో జాబ్‌మేళాలకు ఆదరణ కరువైంది. దానికి తోడు వేతనాలు కూడా తక్కువగా ఉండటంతో నిరుద్యోగులు కూడా ఆసక్తి చూపడం లేదు. పలు మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ లాంటి చిన్న చిన్న కంపెనీలతో మాత్రమే జాబ్‌మేళాలు నిర్వహించడం పెద్ద కంపెనీలు ఆహ్వానించి మెగా జాబ్‌మేళాలు నిర్వహించడం లేదు. జిల్లాలో 2016 అక్టోబర్ 11న ఉపాధి, శిక్షణ శాఖ జిల్లా ఉపాధి కార్యాలయం ఏర్పాటు చేశారు. కార్యాలయంలో జిల్లా ఉపాధి అధికారి, సీనియర్ అసిస్టెంట్ మాత్రమే పని చేస్తున్నారు. గతంలో ఎంప్లాయ్‌మెంట్ సీనియార్టీ ప్రకారం నియామకాలు జరిగేవి. దానిని ప్రామాణికంగా తీసుకోకపోవడంతో ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ చేసుకునే విషయంలో శ్రద్ధ చూపడం లేదు. కనీసం రెన్యూవల్ కూడా చేసుకోవడం లేదని ఆ శాఖ అధికారులు అంటున్నారు.

రేపు జాబ్‌మేళా

ఎంఆర్ఎఫ్ హైదరాబాద్ సంసలో అప్రెంటీస్‌గా పనిచేయుటకు ఈనెల 7న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు సంబంధిత పత్రాలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

ప్రచారంలో విఫలం..

జాబ్‌మేళాలు నిర్వహించే తేదీలను మండలాల్లో ఎంపీడీఓ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, పలు ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే బాగుండేది. కాని అధికారులు వాటి ప్రచారం విషయంలో కూడా పూర్తిగా విఫలమవుతున్నారు. పేరుకే కార్యాలయం ఉంది. కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు లక్షలాది రూపాయాల వేతనాలు ఇస్తున్నారు.

చిన్న కంపెనీలతో జాబ్‌మేళాలు..

పలు మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ లాంటి చిన్న షోరూంలు పలు చిన్న కంపెనీలతో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నాలుగు నెలల్లో ఆరు జాబ్‌మేళాలు నిర్వహించారు. 2025 జనవరి 1న ఆదర్శ ఆటో మోటీవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మానుకోట ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించగా ఖాళీలు 10 చూపించగా కేవలం 8మంది మాత్రమే హాజరు కాగా, ఇద్దరు మాత్రమే ఉద్యోగాలు పొందారు. మార్చి12న వైఎస్‌కే ఇన్ఫోటెక్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 20 పోస్టులకు 12మాత్రమే హాజరు కాగా, నలుగురు మాత్రమే ఉద్యోగంలో చేరారు. మార్చి15న కోస్యన్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలో 60 ఉద్యోగాలకు 15మంది హాజరు కాగా, 9 ఎంపిక గా నలుగురు మాత్రమే ఉద్యోగంలో చేరినట్లు అధికారులు తెలిపారు.

సంస్థాగత ఎన్నికల్లో సత్తా చాటాలి

- ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్


మరిపెడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్: వచ్చే గ్రామస్థాయి సంస్థాగత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని, అందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికునిల్లా పనిచేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని భార్గవి ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో ఎవరైన చిల్లర వేశాలు వేస్తే తోళ్లు తీస్తానని ఘాటుగా ఎమ్మెల్యే హెచ్చరించారు. అనంతరం కార్యకర్తల ఆధ్వర్యంలో బర్త్‌డే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ పరిశీలకుల పాట్ల నాగేశ్వరరావు, టీపీసీసీ పరిశీలకులు కూచన రవళీరెడ్డి, పీసీసీ వెన్నెం శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఐలమల్లు, మార్కెట్ చైర్మన్ సుధాకర్‌నాయక్, రాధాబాయి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దంతాలపల్లి: రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ తెలిపారు. మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తొర్రూరు ఏఎంసీ వైస్ చైర్మన్ బట్టునాయక్, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, ఆర్డీఓ గణేష్, తహసీల్దారు సునీల్‌కుమార్, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఆర్ఐ నజీముద్దీన్, రాజు, ఎంపీఓ అప్సర్ పాషా పాల్గొన్నారు.

రేషన్‌కార్డు నిబంధన తొలగించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కేసముద్రం: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రేషన్‌కార్డు తప్పనిసరి అనే నిబంధనను, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తొలగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేశ్ డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిజమైన లబ్ధిదారులకు రేషన్‌కార్డు లేని కారణంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకావడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వోలం శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రామడుగు వెంకటాచారి, మండల ప్రధాన కార్యదర్శులు బోగోజు నాగేశ్వరాచారి, బోనగిరి ఉపేందర్, మల్యాల రాములు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన


గార్ల: పినిరెడ్డిగూడెం గ్రామంలో బిందెలతో మహిళల ధర్నా


పెద్దవంగర: నిరసన తెలుపుతున్న మహిళలు

పెద్దవంగర: తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని, తమ ప్రాంతంలో నెలకొన్న నీటి ఎద్దడిని తీర్చాలని పేర్కొంటూ సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎంపీడీఓ వేణుమాధవ్‌ను వివరణ కోరగా తమ దృష్టికి వచ్చింది సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నాము. రేపటి వరకు ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తామని తెలిపారు.

గార్ల: మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామంలో తాగునీటి ఎద్దడి తీర్చాలంటూ మహిళలు బిందెలతో రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. ధర్నాలో తొండ కనకమ్మ, వెంకటమ్మ, రాజా, ఉమ, రమాదేవి, నాగలక్ష్మి, ఉపేంద్ర, లక్ష్మమ్మ, లలితమ్మ, యశోద, పిచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి సీతక్కకు ఆహ్వానం



గూడూరు: మండల కేంద్రంలో ఈనెల 10 వ తేదీ శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు రావాలని మంత్రి ధనసరి సీతక్కను అంబేడ్కర్ కమిటీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి. యాకూపాషా సోమవారం ములుగులోని సీతక్క క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందించారు.

కబడ్డీ కోచింగ్ క్యాంపు ప్రారంభం

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో సమ్మర్ కబడ్డీ కోచింగ్ క్యాంపును సోమవారం డీవైఎస్ఓ జ్యోతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులు వేసవిలో కబడ్డీ ఆటను క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి యుగేందర్, గుండోజు శ్రీనివాస్, యాకూబ్, మంద కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కురవి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కురవికి చెందిన ఆలయ మాజీ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాస్ తన తండ్రి సోమిశెట్టి వీరభద్రం జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్టీసీ డిపో డిప్యూటీ సూపరింటెండెంట్ గోపు శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్‌డీఐ వెంకన్న, రియల్టర్ మాచర్ల ఉప్పలయ్య, నాయకులు నాగేశ్వర్‌రావు, మోహన్‌రావు, భద్రయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత



సాక్షి ఎఫెక్ట్..

కొత్తగూడ: ఎట్టకేలకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్‌కు మరమ్మతులు చేసి గుంతను పూడ్చారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గుంత తీసి నిర్లక్ష్యంగా వదిలేసిన దానిపై 'సాక్షి'లో ఇంత నిర్లక్ష్యమా? అనే శీర్షికన కథనం ప్రచురితం అయిన సంగతి తెలిసిందే. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉదయాన్నే మిషన్ భగీరథ ఏఈ నరేష్ పర్యవేక్షణలో హడావుడిగా పైపులైన్‌కు మరమ్మతులు చేసి గుంతను పూడ్చారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కురవి/నెహ్రూసెంటర్/చిన్నగూడూరు/డోర్నకల్: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ జన్మదినం, పెళ్లిరోజును పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకున్నారు. పలు మండల కేంద్రాల్లో నాయకులు ఆయన పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రక్తంతో గీసిన చిత్రపటం అందజేత



దంతాలపల్లి: ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పుట్టిన రోజు పురస్కరించుకొని ఆయన అభిమాని, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు సురేష్ తన రక్తంతో గీసిన చిత్రపటాన్ని సోమవారం ఎమ్మెల్యేకు అందించి, అభిమానాన్ని చాటుకున్నాడు.

రేపు మైనార్టీ గురుకులంలో లక్కీ డ్రా

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో నాన్ మైనారిటీస్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీల విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో ఈనెల 7న బుధవారం ఉదయం 11.00 గంటలకు లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు.

అక్రమ చొరబాటుదారులను పంపించాలి


తొర్రూరు: తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తొర్రూరు: అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిని పంపించాలని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్, బంగ్లా, రోహింగ్యాలను దేశం నుంచి వెనక్కి పంపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమ చొరబాట్లతో దేశానికి నష్టం వాటిల్లుతుందని, వెంటనే వారిని వెనక్కి పంపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, నాయకులు పల్లె కుమార్, కొలుపుల శంకర్, రచ్చ కుమార్, రవిబాబు, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

పెద్దవంగర: రోహింగ్యా వలసదారులను వెనక్కి పంపాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సోమయ్య, భాస్కరాచారి, శంకర్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కురవి: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోతుగంటి మల్లయ్య అన్నారు. సీరోలు మండల కేంద్రంలో సంఘం గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11ఏళ్ల నుంచి బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని తెలిపారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తగరం ముత్తయ్య, కొమ్ము పేందర్, బేగం, నాగన్న, నాగేశ్‌నాయక్, కసనబోయిన రమేశ్, లావుడ్యా లాక్య, కొమ్ము రేణుక, గంగారపు వెంకన్న, రామలింగయ్య పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

కురవి: ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలతోనే సాధ్యమవుతాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయ్యగారలపల్లి గ్రామ సీపీఐ శాఖ ఎన్నిక సోమవారం జరిగింది. పార్టీ జెండాను ఎగురవేశారు. పార్టీ శాఖ కార్యదర్శిగా బొల్లు వెంకన్న, సహాయ కార్యదర్శిగా గజ్జి చంద్రయ్యతోపాటు ఏడుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు బుర్ర సమ్మయ్య, కలగూరం నాగరాజు, నర్సింగం గురువయ్య, కందుల యాకయ్య పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న చిన్న చంద్రన్న

నెహ్రూసెంటర్: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన జరగనున్న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 58 సంవత్సరాలు నిండిన రైతులకు పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని, ప్రభుత్వ మిగులు భూములను రైతులకు పంచాలని డిమాండ్ చేశాడు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య, సహాయ కార్యదర్శి పల్లెల పాపరావు, జిల్లా నాయకులు రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

నేటినుంచి వేసవి శిక్షణ తరగతులు


తొర్రూరు: హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న ఎంఈఓ

తొర్రూరు: విద్యాశాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి ఈ నెల 20 వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య తెలిపారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ఇండోర్ గేమ్స్, గణిత నైపుణ్య శిక్షణ, సైన్స్ ప్రయోగాలు, డ్రాయింగ్, క్రాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్, డ్యాన్స్, వాలీబాల్, షటిల్ తదితర అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఉంటుందని తెలిపారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఐదో తరగతి నుంచి పది వరకు చదివే విద్యార్థులు ఈ వేసవి శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. తొర్రూరు ఉన్నత పాఠశాల, మాటేడు, చెర్లపాలెం, అమ్మాపురం ఉన్నత పాఠశాలల్లో ఉదయం 8గంటల నుంచి 10.30గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. హెచ్‌ఎంలు తుమ్మ వెంకటేశ్వర్లు, జెల్ల లక్ష్మీనారాయణ, బీవీ రావు, పీడీలు ప్రవీణ్‌రెడ్డి, సంజయ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సమ్మర్ క్యాంపులు

కురవి: నేటి నుంచి సీరోలు, కురవి మండలంలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో వేసవి శిక్షణా తరగతుల (సమ్మర్ కోచింగ్) క్యాంపులను 15రోజులపాటు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు వి.బాలోజీ, లచ్చిరాంనాయక్ సోమవారం తెలిపారు. కురవి మండల కేంద్రంతోపాటు రాజోలు, మోద్గులగూడెం, సీరోలు మండల కాంపల్లి హైస్కూల్స్‌లో ఈ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య


విద్యార్థికి బొట్టుపెట్టి కోరుతున్న అధ్యాపకులు

తొర్రూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.అరుణ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బొట్టుపెట్టి కళాశాలలో చేరాలని అభ్యర్థించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరితే ఎలాంటి ఫీజులు ఉండవని, ఉచితంగా పుస్తకాలు, నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బరిగెల నారాయణ, అధ్యాపకులు మల్లయ్య, ఉప్పలయ్య, నర్సయ్య, శివరామకృష్ణ, రాజేష్, కుమార్, నాగరాజు, కమల్‌దీప్ పాల్గొన్నారు.

ధాన్యం తరలించేందుకు ఏర్పాట్లు

కురవి: కాంటా అయిన ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించడానికి వాహనాలను సమకూర్చుకునేందుకు మూడు శాఖల అధికారులు సోమవారం సాయంత్రం 365 జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల కొరత వల్ల మండలంలోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. లారీలు, ఇతర వాహనాల కొరత తీవ్రంగా ఉండడం, వర్షాలు కురిసే అవకాశాలుండడంతో ధాన్యాన్ని తరలించేందుకు సివిల్ సప్లయి మోటార్ వెహికిల్, పోలీసు అధికారులు రహదారిపై వచ్చి పోయే వాహనాలను ఆపి పరిశీలించారు. ఖాళీగా వెళ్తున్న పలు వాహనాలను ఆపి కొనుగోలు కేంద్రాలకు తరలించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి మేనేజర్ కృష్ణవేణి, ఎంవీఐ సాయిచరణ్, పీఎస్సై కృష్ణారెడ్డి, ఏఎస్సై వెంకన్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

కేసముద్రం: అన్నివిధాలుగా అర్హత కలిగిన తనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన బోడ కవిత అనే మహిళ గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తన భర్త లేడని, ఇద్దరు పిల్లలతో గుడిసెలో ఉంటూ, కూలీ పనులకు వెళ్తూ జీవనాన్ని సాగిస్తున్నామని, అలాంటిది ఇటీవల విడుదలైన ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో తన పేరు రాలేదని ఆమె పేర్కొంది. ఎలాగైన తనకు ఇల్లు మంజూరు చేసి న్యాయం చేయాలని వేడుకున్నట్లు తెలిపింది.

సంక్షిప్త సమాచారం

బేతోలు అభివృద్ధికి చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపల్ విలీన గ్రామం బేతోల్ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకుడు, 6వ వార్డు ఇన్‌చార్జ్ మహమ్మద్ రజాక్ సోమవారం డిమాండ్ చేశాడు. బేతోల్ గ్రామంలో నీటిపైపు లైన్ పగిలి నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఎంపీడీఓకు వినతి

గార్ల: ఇందిరమ్మ ఇళ్లు పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ మంగమ్మకు అందజేశారు. కార్యక్రమంలో భద్రాజీ, సక్రు, రాధ, భద్రి, రమ, వెంకన్న పాల్గొన్నారు.

ఉచిత విద్యే లక్ష్యం

మహబూబాబాద్ అర్బన్: పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడమే పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ లక్ష్యమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో సోమవారం పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత విద్య ప్రవేశ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి యాకూబ్, కార్యదర్శులు మంజుల, హుస్సేన్, మండలాల బాధ్యులు రాజశేఖర్, ప్రవీణ్ కుమార్, రహమాన్, రమ్య పాల్గొన్నారు.

వేదపండితుడికి సత్కారం

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వేదపండితుడిగా పనిచేస్తున్న ఆరాధ్యుల బాలకృష్ణశర్మ కర్నాటకలోని శృంగేరి శారదాపీఠాధికారి శ్రీ భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీ స్వామి చేతుల మీదుగా శుక్లయజుర్వేద విద్వాన్‌గా సత్కారాన్ని అందుకున్నట్లు బాలకృష్ణ సోమవారం తెలిపారు.

ఏఐటీయూసీలో చేరిక

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ 40 మంది కార్మికులు టీఆర్ఎస్‌కేవీ నుంచి ఏఐటీయూసీలో చేరినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి సోమవారం తెలిపారు. కార్యక్రమంలో రేషలపల్లి నవీన్, పుచ్చకాయల రమణ, లింగాల విజయ్, రాములు, మంద ఆదాం, రాంమూర్తి, మధుసూధన్ పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా భిక్షపతి



డోర్నకల్: ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా ముల్కలపల్లి గ్రామానికి చెందిన ఇట్టపల్లి భిక్షపతి నియమితులయ్యాడు.

వార్షికోత్సవ సభకు ఆహ్వానం

కేసముద్రం: హైదరాబాద్‌లో ఈనెల 8వ తేదీన త్యాగరాయ గానసభలో నిర్వహించనున్న తెలుగు భాషా చైతన్య సమితి 12వ వార్షికోత్సవ సభలో పాల్గొనాలని కోరుతూ, మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, కవి దండు శ్రీనివాస్‌ను ఆహ్వానించినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వంతెన నిర్మించాలి

కురవి: మండలంలోని మోద్గులగూడెం శివారు బేగావత్ తండా గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ తండావాసులు చేపట్టిన రిలే నిరహార దీక్ష సోమవారం కొనసాగాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బేగావత్ బాలాజీ, తండావాసులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

నెల్లికుదురు: గడ్డివాము దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కాటమల్ల వెంకన్న వరికోత అనంతరం పొలం వద్దనే 80 గడ్డి మోపులను వామిగా పెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామును తగుల బెట్టినట్లు బాధిత రైతు వెంకన్న ఆవేదన వ్యక్తం చేశాడు.

కళాకారులకు స్ఫూర్తిదాయకం

గూడూరు: అరుణోదయ రామారావు జీవితం ప్రజాకళాకారులకు స్ఫూర్తిదాయకమని అరుణోదయ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం అన్నారు. మండలంలోని జగన్నాయకులగూడెంలో సోమవారం రామారావు 6వ స్మారకసభను నిర్వహించారు. కార్యక్రమంలో ఐలయ్య, మురళీకృష్ణ, లింగన్న, అచ్చన్న పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను దిగజారుస్తున్న కేంద్రం

కేసముద్రం: బీజేపీ రాజ్యాంగ విలువలను దిగజారుస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అన్నారం, తాళ్లపూసపల్లి గ్రామాల్లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గుగులోతు దస్రూనాయక్, మురళీ, కదిర సురేందర్, పోలెపాక నాగరాజు పాల్గొన్నారు.

ఓంకార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరు: మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్‌ను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 12న మచ్చాపూర్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బందెల వీరస్వామి, కటకం బుచ్చిరాములు, గుండగాని సత్తయ్య, చంద్రయ్య, సత్యం పాల్గొన్నారు.

వాటర్ ఫ్రిజ్ అందజేత



నెల్లికుదురు: మండలంలోని కాస్యతండా శివారు ధర్మతండాకు చెందిన బి.నర్సింహ పోలీస్‌స్టేషన్‌కు సుమారు రూ.7వేల విలువ చేసే వాటర్ ఫ్రిజ్‌ను సోమవారం అందించాడు. ట్రెయినీ ఎస్సై శివరామకృష్ణ ప్రారంభించారు.

పెద్దమ్మ తల్లి వేడుకలు ప్రారంభం

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామంలో ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి వేడుకలను సోమవారం ప్రారంభించారు. ముదిరాజ్‌లు పెద్దమ్మ తల్లి విగ్రహంతోపాటు మరికొన్ని దేవతల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి జల శుద్ధి చేశారు.

భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

మరిపెడ రూరల్: మరిపెడ మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. విద్యుత్ ప్రమాదాలను తగ్గించాలన్న ఉద్దేశంతో ప్రజలందరికి అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ కృషి చేస్తుందన్నారు. ఈ క్రమంలోనే భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు మధుసూదన్, పెద్దిరాజ్యం, సీతాదేవి, బి.అజయ్, రమేశ్, నవ్య సబ్ ఇంజనీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.